ప్రజాశక్తి
బుధవారం 31 జులై 2024
5
అనంతపురం

ధర్నాలో పాల్గొన్న నాయకులు

ఉపాధి హామీ పనులు కల్పించాలి

ధర్నాలో వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ఉపాధి హామీ పనులు కల్పించాలని, కూలీలకు ఇవ్వాల్సిన తొమ్మిది వారాలు పెండింగ్ వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వ్యకాసం ఆధ్వర్యంలో స్థానిక ద్వామా కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వ్యకాసం రాష్ట్ర నాయకురాలు వి. సావిత్రి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. కృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న 9 వారాల వేతనాలు చెల్లించాలన్నారు. రాజకీయ కారణాలతో ఉపాధి పనులు ఆపరాదని, కూలీలకు పనిముట్లు, పే స్లిపులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఈ చట్టంలో కేంద్ర ప్రభుత్వం కొత్త కొత్త నిబంధనలు తీసుకొచ్చిందని విమర్శించారు. సమ్మర్ అలవెన్స్ ఎత్తివేయడం, రెండు పూటల పని, ఆన్లైన్ మస్టర్ చేసిన పనులకు వేతనాలు చెల్లించకుండా నెలల తరబడి నిర్లక్ష్యం చేయడం లాంటివి జరుగుతున్నాయన్నారు. పనుల దగ్గర కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించి రోజుకూలి రూ. 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఉపాధి హామీపనులకు బడ్జెట్లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణ నారాయణ నాగలింగయ్య, సహాయ కార్యదర్శులు భాస్కర్, పెద్దయ్య, పుష్పరాజ్, ఆదెన్న తదితరులు పాల్గొన్నారు

కౌలు రైతుకు దక్కని గుర్తింపు

◆ అవగాహన కార్యక్రమాలతో సరి

◆ కార్డుల మంజూరులో ఇప్పటికీ లక్ష్యంలో 12 .4 శాతమే మంజూరు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కౌలు రైతు గుర్తింపునకు నోచుకోవడం లేదు. కౌలు రైతులను గుర్తించి కార్డులు మంజూరు చేసే ప్రక్రియ నామ మాత్రంగా నడుస్తోంది. అధికారులు అవగాహన కార్యక్రమాలతోనే సరిపెడుతున్నారు. అనంతపురం జిల్లాలో సుమారు ఒకటిన్నర లక్షల మందికిపైగా కౌలు రైతులున్నారు. వీరందరూ ప్రకృతి వైపరీత్యాల నడుమ ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పంటలు సాగు చేస్తున్నారు. ఏదైనా పంట నష్టం సంభవిస్తే పరిహారం అందివ్వాలంటే ప్రధానంగా కౌలు రైతుకు గుర్తింపు కార్డు ఉండాల్సి ఉంటుంది. దీన్నే సిసిఆర్‌సి (క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డ్సు) అంటారు. ఇది ఉంటేనే రైతుకు ప్రభుత్వం ద్వారా ఏదైనా సహాయం అందుకునే వీలుంటుంది. పంట అమ్ముకోవాలన్న ఈ కార్డును చూపించాల్సి ఉంటుంది. ఇంతటి కీలకమైన ఈ కార్డును రైతులకు అందజేసే ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఇప్పటికే వర్షాభావంతో రైతులు నష్టపోయే పరిస్థితి కూడా నెలకొంది. ఈ నష్టానికి సంబంధించి పరిహారం రావాలన్న ఈ కార్డు ఉంటేనే సాధ్యమవుతుంది.

లక్ష్యంలో 12.4 శాతమే పంపిణీ

అనంతపురం జిల్లాలో ఒకనటిన్నర లక్షల మంది కౌలు రైతులుంటారన్నది అంచనా. అయితే ఇందులో ఈ ఏడాది 8330 మంది రైతులకు సిసిఆర్‌సి కార్డులు అందజేయాలన్నది వ్యవసాయ శాఖ ముందున్న లక్ష్యం. అది కూడా పూర్తవలేదు. ఇప్పటి వరకు 31 మండలాల్లో కలిపి 1048 మందికి మాత్రమే సిసిఆర్‌ఎస్ కార్డుల మంజూరుకు సిద్ధమయ్యారు. కొన్ని మండలాల్లో అయితే ఇద్దరిని మాత్రమే సిసిఆర్‌సి కార్డులకు అర్హులుగా గుర్తించడం గమనార్హం. జిల్లాలోనే అత్యధికంగా కౌలు రైతులుండే కణేకల్ మండలంలో ఇద్దరికి మాత్రమే సిసిఆర్‌సి కార్డులు మంజూరుకు అర్హులని గుర్తించారు. ఈ మండలంలో 370 మంది రైతులకు కార్డులు మంజూరు చేయాలన్నది లక్ష్యం. ఇక కల్యాణదుర్గంలో ఇద్దరే అర్హులను గుర్తించారు. ఇలా మొత్తంగా సిసిఆర్‌సి పంపిణీ నత్తనడకన సాగుతోంది.

సిసిఆర్‌సి కార్డులు అందజేయాలి

అనంతపురం జిల్లాలో అత్యధికంగా కౌలు రైతులున్నారు. ఉరవకొండ ప్రాంతంలోనూ, రాయదుర్గం ప్రాంతంలోనూ కౌలు రైతులు అధికంగానున్నారు. కొన్ని చోట్ల దేవాదాయ భూములు కౌలుకు చేస్తున్న రైతులూ ఉన్నారు. అటువంటి వారికి కూడా సిసిఆర్‌సిల్లేవు. ఇప్పటికైనా అధికారులు వీటిపై దృష్టి సారించి కార్డులు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలి. లేకపోతే పంటనష్టపోతే వారికి ఎటువంటి సాయం అందే పరిస్థితి ఉండదు.

బాలరంగయ్య,
ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి

పీడీకి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

స్కీం వర్కర్ల తొలగింపులు ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

స్కీం వర్కర్ల తొలగింపు చర్యలను ఆపాలని, తొలగించిన స్కీం వర్కర్లను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు అధ్యక్ష, ప్రధాన క్యార్యదర్శులు ఎం. నాగమణి, ఎస్. నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. స్కీం వర్కర్ల సమస్యలు తొలగించాలన్న డిమాండ్‌తో సిఐటియు ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక జిల్లాలో స్థానిక రాజకీయ నాయకులు స్కీం వర్కర్లపై దాడులు చేసి బలవంతపు రాజీనామాలు చేయిస్తున్నారని విమర్శించారు. వారు రాజీనామా చేయకపోతే బెదిరింపులకు దిగుతున్నారన్నారు. 2003 నుండి పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను 670 మందిని తొలగించారన్నారు. వీరిలో ఎక్కువమంది ఒంటరి మహిళలు ఉన్నారన్నారు. వీరిపై ఎలాంటి ఆరోపణలు లేకపోయినా స్థానిక నాయకులు చెప్పారని అధికారులు తొలగిస్తున్నారని విమర్శించారు. 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న విఒఎలను అక్రమంగా తొలగిస్తున్నారని గ్రామ సంఘం తీర్మానం లేకుండా సభ్యుల అనుమతి లేకుండా సీసీలు ఏపీఎం బయట వ్యక్తుల మాటలని విని తొలగిస్తున్నారన్నారు. సభ్యులు అనుమతి లేకుండా ఇలా చేయడం సరైనది కాదని ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొలగించినవి విఒఎలను విధుల్లోకి తీసుకోవాలన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు సమర్పించారు. అదేవిధంగా పీడీని కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వెంకటనారాయణ, ఏటీఎం నాగరాజు, శ్రీనివాసులు, ఎండిఎం జిల్లా కోశాధికారి సరస్వతి, విఒఎ జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణ, పాతన్న, విఒఎలు, ఎండిఎం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం అనంతపురం ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు ప్రజలు, నాయకుల నుంచి అర్జీలను మంత్రి స్వీకరించారు. అక్కడికక్కడే పరిష్కరించాల్సిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సుపరిపాలన దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యలను ఎలాంటి ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి

పారిశ్రామికవేత్తలతో మంత్రి సవిత

పారిశ్రామిక వేత్తలను ఆహ్వానిస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులకు, అభిబృద్ధి ప్రాజెక్టులు చేపట్టేందుకు టిడిపి ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలను ఆహ్వానిస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. ఈ మేరకు ఆమె బెంగుళూరులోని తాజ్ హోటల్‌లో పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన టెక్సపోర్ట్ ఓవర్సీస్ ప్రవేట్ లిమిటెడ్, ఇండియన్ డిజైన్స్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, టెక్సపోర్ట్ సిండికేట్ లిమిటెడ్ ,కాటన్ వరల్డ్, టెక్సపోర్ట్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, సిల్వర్ స్పార్క్ అప్పారెల్, అరవింద్ లిమిటెడ్, షాహి ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్, డెనిమ్ ఇండియా, ఆదిత్య బిర్లా రిటైల్ ఫ్యాషన్స్, సేవ్ ఎర్త్ ప్రైవేట్ లిమిటెడ్,ప్రోస్కిల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ టెక్స్ టైల్,, గార్మెంట్స్ తదితర పారిశ్రామిక వేత్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులకు, అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టేందుకు ఉన్న అవకాశాలు వివరించారు. రాష్ట్రంలో రాజకీయ స్థిరత్వంతో కూడిన ప్రభుత్వ పాలన ఉందని, పెట్టుబడులను ప్రోత్సహించే సానుకూల దృక్పథం తమ ప్రభుత్వం ఉందని మంత్రి వివరించారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకునే నైపుణ్యం కలిగిన యువత రాష్ట్రంలో ఉందని వారి ప్రతిభకు తగిన అవకాశాలు కల్పించడానికి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను మంత్రి కోరారు.

పకడ్బందీగా సిఎం పర్యటన ఏర్పాట్లు

ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి - మడకశిర

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆగస్టు 1వ తేదీన నియోజకవర్గ పరిధిలోని గుండుమల పంచాయతీలో నిర్వహిస్తున్న పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటిస్తున్న గుండుమల గ్రామాన్ని మంత్రి మంగళవారం సందర్శించారు. హెలీపాడ్, పెన్షన్ పంపిణీ, సిఎం పాల్గొనే కార్యక్రమాలపై స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుతో కలసి అధికారులతో చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 1 తేదీన ఋఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం పాల్గొని అనంతరం గ్రామస్తులతో ముఖాముఖి కార్యక్రమాలలో పాల్గొంటారన్నారు. గ్రామ సమస్యలు పరిష్కరించడానికి ప్రజా వేదిక నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాత్ర ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, డాక్టర్ సెల్ అధ్యక్షులు కొంకల్లు కృష్ణమూర్తి, జిల్లా కలెక్టర్ టిఎస్. చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా ఎస్పీ రత్న, ఆర్డీవో భాగ్యరేఖ, స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ గుండుమల జయప్ప, గుండుమల సర్పంచి కరియన్న, మాజీ సర్పంచి గుండుమల చంద్రప్ప, స్థానిక తహశీల్దార్ వెంకటేష్, టిడిపి మండల కన్వీనర్లు మనోహర్, లక్ష్మీనారాయణ, గణేష్, మదన కొండప్ప కుమారస్వామి, దాసిరెడ్డి, నియోజకవర్గ టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

నార్పలలో కుక్కల బెడద

బెంబేలెత్తుతున్న ప్రజలు

ప్రజాశక్తి-నార్పల

చెత్తకుప్పలో ఉన్న వీధి కుక్కలు

మండల కేంద్రంలో కుక్కల బెడద తీవ్రంగా మారింది. ఇటీవల ఎవరిని పడితే వారిపై కుక్కలు దాడి చేస్తుండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలోని వీధుల్లో కుక్కల సంచారం విపరీతంగా ఉంది. చిన్నారులు, పెద్దలు ఎవరైనా చేతిలో పట్టుకుని వెళ్తుంటే దాడి చేసి తీసుకోవడం రివాజుగా మారిందని మండల వాసులు వాపోతున్నారు. దీనికితోడు ఇళ్ల ముందు మలమూత్రాలు విసర్జిస్తుండటంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల పలు ప్రాంతాల్లో కుక్కలు చిన్నారులపై దాడులు చేసి చంపిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో మండలవాసులు, తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. మండల కేంద్రంలో ఒంటరిగా వెళ్లాలంటేనే జంకాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కుక్కలను పట్టి ఇతర ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. దీనికితోడు పెంపుడు కుక్కలను కూడా గుర్తించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించాలని కోరుతున్నారు.

ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు సమిష్టిగా శ్రమిద్దాం

ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు సమిష్టిగా శ్రమిద్దామని ఎస్పీ కెవి.మురళీకృష్ణ పిలుపునిచ్చారు. జిల్లాలోని ఎస్ఐ, ఆ పైస్థాయి పోలీసు అధికారులతో మంగళవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లాలో జరిగిన గ్రేవ్ అండ్ నాన్ గ్రేవ్‌ల పురోగతిపై స్టేషన్‌వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసుల ఛేదింపు, పురోగతి కోసం పాటించాల్సిన విధి విధానాలు, మెళకువలపై దిశానిర్దేశం చేశారు. చెడు నడత కల్గిన రౌడీషీటర్లు, కిరాయి హంతకులకు కౌన్సెలింగ్ నిర్వహించి సత్ప్రవర్తనతో నడుచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనుమానాస్పద మృతి కేసుల ఛేదింపును ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో దర్యాప్తు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా చేయాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఫ్యాక్షన్ ప్రభావం లేకున్నప్పటికీ నిర్లక్ష్యం చేయరాదన్నారు. జిల్లాలో ఎక్కడా గంజాయి, తదితర మాదక ద్రవ్యాల అక్రమ రవాణ, విక్రయాలు, వినియోగం జరుగరాదని, లోతుగా దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. ఈసమావేశంలో అదనపు ఎస్పీ ఆర్.విజయ భాస్కర్‌రెడ్డి, డిటిసి వీర్రాజు, డీఎస్పీలు టివివి ప్రతాప్, బి.శ్రీనివాసులు, జనార్ధన్‌నాయుడు, బివి.శివారెడ్డి, సిఐలు, ఎస్ఐలు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నీటితో నింపాలి

కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-వజ్రకరూరు

జిల్లాలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లకు నీటిని వెంటనే నింపేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఉరవకొండ మండలం నింబగల్లు గ్రామం వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును కలెక్టర్ పరిశీలించారు. ఇందులో భాగంగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కెపాసిటీ, ట్యాంకులోకి నీరు ఎలా నింపుతారు, హెచ్‌ఎల్‌సి కాకుండా ఇతర ఏ రకంగా ట్యాంకులోకి నీటిని నింపే అవకాశం ఉందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు హెచ్‌ఎల్‌సి నుంచి నీటిని నింపాల్సి ఉండగా, ట్యాంకుల వద్దకు హెచ్‌ఎల్‌సి కాలువ ద్వారా నీరు చేరిన వెంటనే ట్యాంకులకు నీరు నింపాలని ఆదేశించారు. అనంతరం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ హసాన్‌బాషా, డిఇ అంజుమన్ సఫ్రీన్, జెఇ ఫామినా, ఎంపిడిఒ సుబ్బరాజు, డిప్యూటీ తహశీల్దార్ హరినాథ్ పాల్గొన్నారు.

ఉన్నత చదువులు చదవాలి

గురుకుల పాఠశాల విద్యార్థినులు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగం సాధించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ఉరవకొండ మండల కేంద్రంలోని బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఇందులో భాగంగా గురుకుల పాఠశాలలో తరగతి, హాస్టల్ గదులు, వంటగది, అధ్యాపకుల క్వార్టర్స్‌లను పరిశీలించి, విద్యార్థినులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

తపాలా సేవల మెరుగుకు చర్యలు

జిల్లా సూపరింటెండెంట్ గుంపుస్వామి

ప్రజాశక్తి-రాయదుర్గం

తపాల శాఖ సేవలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని తపాలశాఖ జిల్లా సూపరింటెండెంట్ గుంపుస్వామి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఓబులాచారి రోడ్డులో ఉన్న తపాలా ఉప కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కార్యాలయంలో ప్రజలకు అందిస్తున్న సేవలపై సిబ్బంది, ఖాతాదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం తపాలా కార్యాలయం ఇరుకుగా ఉండి ఇబ్బందిగా ఉందని ప్రజలు తెలిపారు. గతంలో రద్దు చేసిన బజారు పోస్టాఫీస్‌ను ప్రారంభించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే అవసరమైన సిబ్బందిని నియమించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం రాయదుర్గం సబ్ డివిజన్ పరిధిలోని తపాలా శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించి తపాలా సేవలను మెరుగుపరిచేందుకు ప్రజల నుంచి ఎక్కువ తపాలా ఖాతాలు, బీమా పాలసీలు చేయించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ అడ్మినిస్ట్రేటర్ సురేంద్ర, ఏఎస్పీ ఉమామహేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేయాలి

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

'గతంలో ఏం జరిగిందో అనవసరం.. ఇప్పటి నుంచి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాల్సిందే' అని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. మంగళవారం అర్బన్ పరిధిలోని రుద్రంపేట సచివాలయం-1ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సచివాలయ రికార్డులు, సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. అలాగే పంచాయతీ పరిధిలో ఉన్న ఫిర్యాదులు, సమస్యల పరిష్కారంపై ఆరాతీశారు. తర్వాత పంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివద్ధి పనుల గురించి ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ పరిధిలో ప్రజా సమస్యలపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ముఖ్యంగా విద్యుత్, పారిశుధ్య సమస్యలు ఉన్నాయన్నారు. తక్షణం వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలన్నారు. ఎవరైనా పనితీరులో నిర్లక్ష్యం వహిస్తే కచ్చితంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి

రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్ సూచించారు. మంగళవారం అనంతపురంలోని నవోదయ కాలనీలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికలు)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల విద్య సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులను ఉపాధ్యాయులు తమ పిల్లల్లాగా భావించి విద్యను బోధించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారులు, గిరిజన నాయకులు ఆనంద్, మల్లికార్జున నాయక్, స్వామినాయక్, భాస్కర్‌నాయక్, విజయ్‌నాయక్, ప్రసాద్‌నాయక్, లక్ష్మానాయక్, హనుమంతునాయక్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

గుత్తి : మండలంలోని రజాపురం గ్రామం ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలికల అథ్లెటిక్స్ మీట్ విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. ముందుగా పోటీలను ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ లక్ష్మణరావు, ఎంఇఒ బి.రవినాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు బహుమతులు అందజేసిన అతిథులు

పెద్దవడుగూరు విద్యార్థిని ప్రతిభ

పెద్దవడుగూరు : మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాల విద్యార్థులు గుత్తి మండలం రజాపురంలో మంగళవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలికల అథ్లెటిక్స్‌లో సత్తాచాటారు. అండర్-16 లాంగ్ జంప్ పోటీల్లో శృతి ద్వితీయ స్థానంలో నిలవగా అండర్-14 గుండువిసరుటలో వైష్ణవి తృతీయస్థానంలో నిలిచింది. దీంతో విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపల్ ఉషా, వ్యాయామ ఉపాధ్యాయురాలు సరిత అభినందించారు.

సమస్యల పరిష్కారం కానీ అజెండా ఎందుకు ..?

సమస్యలపై ప్రశ్నిస్తున్న సభ్యులు

గుత్తి : పాలకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి ప్రతినెలా కౌన్సిల్ సమావేశంలో చర్చించేందుకు అజెండాను రూపొందిస్తున్నారుగానీ పరిష్కరించిన పాపానపోలేదని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సభా మందిరంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై సభ్యులు ఏకరువు పెట్టారు. ఇందుకు కమిషనర్ జి.శ్రీనివాసులు స్పందిస్తూ ఆయా సమస్యల పరిష్కారానికి త్వరలో పరిష్కారం చూపుతామని హామీలు ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ డిఇ హేమచంద్ర, టీపీఎస్ మహబూబ్ జాన్, ఆర్ఐ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంగీకార పత్రం ఇస్తే విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం

గుత్తి : పట్టణ శివారులోని షారోన్ కాలనీకు అంచనా వ్యయం చెల్లిస్తామని అంగీకార పత్రం ఇస్తే విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని ఎపిఎస్‌పిడిసిఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సాయిశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. షారోన్ కాలనీలోని విద్యుత్ సమస్య తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. మున్సిపల్ శాఖ, కాలనీవాసులు కానీ అంచనా వ్యయం చెల్లిస్తామని అంగీకార పత్రం విద్యుత్ శాఖకు అందజేస్తే తాము కాలనీలో స్తంభాలు ఏర్పాటు చేసి తీగల లాగి విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.

సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ

బ్రహ్మసముద్రం : పౌష్టికాహారం అందించడమే ఐసిడిఎస్ లక్ష్యమని సిడిపిఒ లక్ష్మీప్రసన్న తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని వేపులపర్తిలో నిర్వహించిన సెక్టార్ మీటింగ్‌లో ఆమె మాట్లాడుతూ వచ్చేనెల 1వతేదీ నుంచి 8వతేదీ వరకూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకురాళ్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకూ కేంద్రాల్లోనే ఉండాలన్నారు. అలాగే గ్రామాల్లో అభివృద్ధి పథకాలపై నిర్వహించే కార్యక్రమాలకు హాజరు కావాలన్నారు. 18 రకాల రికార్డులను తప్పక నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ రామాంజనమ్మ, బ్లాక్ కోఆర్డినేటర్ జ్ఞానేశ్వరి, వేపులుపర్తి అంగన్వాడి సెక్టార్ లీడర్లు తిప్పిరమ్మ, సుజాత, అనిత, సంతోషమ్మ, తిమ్మక్క, పాల్ వెంకటాపురం సుజాత, మామడూరు వరలక్ష్మి, సత్యమ్మ, త్రివేణి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు కార్పస్ ఫండ్

అనంతపురం క్రైం : జిల్లాలో ఇటీవల మృతిచెందిన ఏఆర్ ఎస్ఐ, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబాలకు కార్పస్ ఫండ్ కింద రూ.2లక్షల చెక్కులను ఎస్పీ కెవి.మురళీకృష్ణ మంగళవారం బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎస్‌బి సిఐ ఇందిర, సూపరింటెండెంట్ ప్రసాద్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, శ్రీనివాసుల నాయుడు, ఆనంద్, లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

నిరుపేదకు ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

బుక్కరాయసముద్రం : ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న కుటుంబాలకు మాజీ జడ్పిటిసి రామలింగారెడ్డి మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. మండలం సిద్ధరాంపురంలో ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న బలిజ లక్ష్మయ్య కుటుంబానికి రూ.10వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాటమయ్య, చిన్నమద్దిలేటి, నారాయణస్వామి, తలారి నాగేంద్ర, చిన్నారాజు, మారుతీ, రవి, చెన్నమయ్య, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బ్రహ్మసముద్రం : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రాజేష్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా హాస్టల్‌లోని వంటగది, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట చేసేవారు ముందుగా చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. అదేవిధంగా వంటపాత్రలు, భోజనానికి వాడే ప్లేట్లు, గ్లాసులను శుభ్రంగా ఉంచాలన్నారు. ఏ పూటకు ఆపూట విద్యార్థులకు వేడిగా రుచికరమైన వంటలు వండి వడ్డించాలన్నారు. పాత్రలపై మూతలు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ హాస్టల్ అధికారి శ్రీనివాసులు, హెల్త్ అసిస్టెంట్ నారాయణ, వసతిగృహ సిబ్బంది పాల్గొన్నారు.


వంట పాత్రలను పరిశీలిస్తున్న వైద్యాధికారి రాజేష్‌కుమార్

ఎంఇఒను విధుల నుంచి తొలగించాలి

ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలతో ముడుపులు తీసుకుంటూ విద్యాశాఖ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఎంఇఒ నాగమణిని వెంటనే విధుల నుంచి తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని నారాయణ పాఠశాలలో పుస్తకాలు అమ్ముతున్నట్లు తెలుసుకుని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు పాఠశాల వద్దకు చేరుకుని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో పాఠ్య పుస్తకాల అమ్మకాలపై ఎంఇఒ నాగమణి వివరణ కోరగా కల్లబొల్లి మాటలు చెబుతూ కాలయాపన చేస్తోందన్నారు. ప్రయివేటు పాఠశాలల్లో విచ్చలవిడిగా పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నా కనీసం ఒక్క పాఠశాలపై కూడా చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. పాఠశాలల నుంచి ముడుపులు చేరడం వల్లే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఎంఇఒ నాగమణిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గౌతమ్, అరవింద్, ఎఐఎస్ఎఫ్ అభిషేక్, కార్తీక్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ఐ నాయకులు

'నాగమణి'పై చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఎంఇఒ నాగమణిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన ఎంఇఒ నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేటు పాఠశాలలకు ఒత్తాసు పలుకుతుండటం బాధాకరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ప్రయివేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, దుస్తులు, స్టేషనరీలు విక్రయిస్తున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రయివేట్ పాఠశాలల నిర్వాహకులు ఇచ్చే ముడుపులకు అలవాడే ఇలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి ఎంఇఒ నాగమణిని విధుల నుంచి తొలగించాలని, లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో విద్యార్థుల సంఘాలతో కలిసి ఆందోళనలను చేస్తామని హెచ్చరించారు.

ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి : ఎమ్మెల్యే కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రజలు తమ ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా మంగళవారం పట్టణంలో ఉన్న నేసేపేటలోని పాలబావిలో దోమల లార్వాలను సంహరించే గంబూజియా చేపలను నీటిలోకి వదిలారు. తర్వాత ఫాగింగ్ యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో అనేకమంది పేద, మధ్యతరగతి ప్రజలు ఉన్నారన్నారు. వర్షాకాలంలో దోమలు, బ్యాక్టీరియా, వైరస్‌ల కారణంగా పిల్లలు, వృద్ధులు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. అనంతరం రాణిసత్రం ఆవరణలో ఉన్న అన్నక్యాంటీన్ పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, కమిషనర్ పి.కిషోర్, రాయదుర్గం సబ్ యూనిట్ మలేరియా ఆఫీసర్ నాగేంద్రప్రసాద్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వేణుగోపాల్, వార్డు సభ్యులు గోవింద, గోవిందరాజులు, అజయ్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, వన్నూరుస్వామి, మాజీ వైస్‌ఛైర్మన్ గాజుల వెంకటేశులు, మాజీ వార్డు సభ్యులు ధనార్దన, పురుషోత్తం, నాయకులు పసుపులేటి నాగరాజు, ఇనాయత్ బాషా, శానిటరీ ఇన్స్‌పెక్టర్ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

గంబూజియా చేపలను వదులుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

బెలుగుప్ప : దోమల నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామపంచాయతీలో ఉన్న దుగ్గెమ్మ చెరువులో గంబూజియా చేపలను నీటి చెరువులోకి వదిలారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సుబ్బరాజు, వైద్యాధికారి డాక్టర్ కార్తీక్ కుమార్‌రెడ్డి, సర్పంచి తలారి రత్నమ్మ, విస్తరణ అధికారి మాధవరెడ్డి, పరిపాలన అధికారి దామోదరయ్య, సూపర్‌వైజర్ రమణ, నాయకులు తిమ్మప్ప, సిద్ధప్ప, రాము, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానీయొద్దు : ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-నార్పల

మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రజాప్రనిధులు మండలవ్యాప్తంగా ఉన్న నీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. మండలంలోని చాలా గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని, బోర్లు వేసినా నీరు పడటం లేదని చెప్పారు. దీనికితోడు సిద్ధరాచెర్లలో ఫ్లోరైడ్ సమస్య కారణంగా కాళ్లు, చేతులు వకర పోతున్నాయని ఎంపిటిసి శంకర్‌యాదవ్, సర్పంచి రామాంజనేయులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ రవీంద్రనాథ్‌రెడ్డి స్పందిస్తూ నీటి సమస్య ఉన్న పంచాయతీల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. ఇకపోతే గతంలో ఇచ్చిన పట్టాలపై విచారించి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కాగా అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేయాలని సిపిఐ మండల కార్యదర్శి గంగాధర ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. అలాగే మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని ప్రధానోపాధ్యాయుడు నాగేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులు, విద్యార్థుల తలిదండ్రులు ఎమ్మెల్యేకు సమర్పించారు. ఈ సమావేశంలో జడ్పిటిసి నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు, ఎంపిడిఒ ఏసీ రాముడు, ఎంఇఒలు కృష్ణయ్య, నారపరెడ్డి, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, వెలుగు ఏసీ మద్దిలేటి, ఐఆర్‌డి శైలజారాణి, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనర్సింహులు, వ్యవసాయ అధికారి చెన్న వీరాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలి

రాయలసీమ రీజియన్ ఇన్‌ఛార్జి హోంగార్డుల కమాండెంట్ మహేష్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

హోంగార్డులు ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ జిల్లా పోలీసు శాఖకు మంచిపేరు తీసుకురావాలని రాయలసీమ రీజియన్ ఇన్‌ఛార్జి హోంగార్డుల కమాండెంట్ ఎం.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఎస్పీ కెవి.మురళీకృష్ణ ఆదేశాల మేరకు జిల్లాలోని హోంగార్డులకు మంగళవారం స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో పరేడ్ నిర్వహించారు. ముందుగా హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఎప్పుడూ గుర్తు చేసుకుంటూ ఉండాలన్నారు. హోంగార్డుల దైనందిన విధులు సవాళ్లతో కూడుకున్నవే అన్నారు. ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యాంగా ఉన్నపుడే సమర్థవంతంగా విధులు నిర్వర్తించడానికి వీలవుతుందన్నారు. విధుల్లో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. అనంతరం దర్బార్ నిర్వహించి హోంగార్డుల సమస్యలు, సాదక బాధకాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మధు, తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వందనం స్వీకరిస్తున్న రాయలసీమ రీజియన్ ఇన్‌ఛార్జి హోంగార్డుల కమాండెంట్ మహేష్‌కుమార్

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం సరఫరా చేసినటు విద్యార్థుల కిట్‌ను మండల విద్యాశాఖ అధికారి వెంకట్ రమేష్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు కె.వీరేష్, ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి డి.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంపై శిక్షణ

బుక్కరాయసముద్రం : పెరటి కోళ్ల పెంపకంపై మంగళవారం మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో అంగన్వాడీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కెవికె ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మల్లేశ్వరి మాట్లాడుతో కెవికె స్వర్ణోత్సవాల్లో భాగంగా అంగన్వాడీ టీచర్లకు పెరటి కోళ్ల పెంపకం, కోడిగుడ్డు, మాంసం పోషక లాభాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రంలో మల్లేశ్వరి, సుధారాణి, కిషోర్‌రెడ్డి, మాధవి, శశికళ, చందన, తదితరులు పాల్గొన్నారు.

మటన్ మార్కెట్ తనిఖీ

రాయదుర్గం : పట్టణంలోని దాసప్ప రోడ్డులో ఉన్న మటన్ మార్కెట్‌ను కమిషనర్ పి.కిషోర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మటన్ మార్కెట్‌లో అపరిశుభ్రత ఉందని,దోమలు, ఈగలు ముసిరిన మాంసాన్ని, అనారోగ్యకరమైన మాంసాన్ని విక్రయిస్తున్నారని ప్రజల నుండి ఫిర్యాదులు వచ్చాయన్నారు. నిబంధనలు ఉల్లంఘించి మాంసం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

ప్రజాశక్తి-గుత్తి

సంత్ శ్రీ సేవాలాల్ ట్రస్టు వ్యవస్థాపకులు పూజారి రంజిత్‌నాయక్ వర్థంతిని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని చెర్లోపల్లి పంచాయతీలో ఉన్న సేవాఘడ్‌లో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా రంజిత్‌నాయక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత ఆలయంలో సేవాలాల్ మహారాజ్, మాత జగదాంబకు ప్రత్యేక పూజలు చేశారు. వైద్య శిబిరంలో 325 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. అనంతరం టిటిడి కళ్యాణ మండపంలో నిర్వహించిన ట్రస్టు కార్యవర్గ సమావేశంలో సేవాలాల్ ట్రస్టు అధ్యక్షుడు కొర్ర జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు కేశవనాయక్, ప్రధానకార్యదర్శి అశ్వర్థనాయక్ మాట్లాడుతూ సేవాఘడ్ రంజిత్ నాయక్ పేరుతో డిగ్రీ కళాశాల, యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం వసతి గృహాలు నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఎ.వెంకటేష్, ట్రస్టు సభ్యులు రవీంద్రనాయక్, బాలనాయక్, భూక్యా వెంకటరమణనాయక్, రామచంద్రనాయక్, సుబ్రమణ్యంనాయక్, శేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహరాజ్‌ను దర్శించుకున్న ఎమ్మెల్యే

సేవాఘడ్ ఉన్న బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్, మాత జగదాంబ అమ్మవారిని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దర్శనానికి సేవాఘడ్ వచ్చిన ఎమ్మెల్యేకి సేవాలాల్ మహరాజ్ ట్రస్టు సభ్యులు ఘన స్వాగతం పలికారు. తర్వాత ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి ఎమ్మెల్యేకి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

స్వామివారిని దర్శించుకుని వస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

ప్రశాంతంగా టెండర్లు

వజ్రకరూరు : ఉరవకొండ మేజర్ గ్రామపంచాయతీ ఆదాయ వనరులకు సంబంధించి సోమవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన షీల్డ్ టెండర్లు ప్రశాంతంగా జరిగాయి. ఆయా టెండర్ల ద్వారా గ్రామ పంచాయతీకి రూ.24,92,500 ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో సర్పంచు లలిత, కార్యదర్శి గౌసుసాహెబ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన పీర్లపండుగ

బుక్కరాయసముద్రం : మండలంలోని పసలూరు గ్రామంలో నిర్వహించిన చిన్న పీర్ల పండుగ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. ఇందులో భాగంగా పీర్లస్వాములను ఊరేగింపుగా పురవీధుల గుండా జలదికి తరలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చిన్నపరెడ్డి, పెద్దలు కల్పన, రామకృష్ణారెడ్డి, వీరప్ప, ఎం.పెద్దన్న, వెంకటరాముడు, సిపి.పెద్దన్న, టి.పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పింఛన్లు

నార్పల : మండల వ్యాప్తంగా వచ్చేనెల 1వ తేదీన ఉదయం 6గంటలకే సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వచ్చి పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ రాముడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున పింఛన్‌దారులు సచివాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు.

పుట్లూరు : మండల వ్యాప్తంగా వచ్చేనెల 1వతేదీనే సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ దస్తగిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారులు సచిలయానికిగానీ, ఏ ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వెళ్లవద్దన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పామిడి : విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంత్రి పయ్యావుల కేశవ్‌కు పామిడి సెక్షన్ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు వినతిపత్రం సమర్పించారు. అనంతపురంలోని స్వగృహంలో మంత్రిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారీ వ్యవస్థను రద్దు చేసి విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను డిపార్ట్మెంట్ కార్మికులుగా గుర్తించాలని కోరారు. అలాగే రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనం చెల్లించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కార్మికులు నారాయణస్వామి, అజయ్ కుమార్, సుదర్శన్, నర్సింగరావు, నరసింహ, దేవేంద్ర, నాగరాజు, తదితరులు ఉన్నారు.

తండాల్లో సమస్యలు పరిష్కరించాలి

పామిడి : మండలంలోని ఎగువ తండా, దిగువ తండాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని రామగిరి ఎంపిటిసి మజ్జిగ రాజశేఖర్ కోరారు. ఈమేరకు మంగళవారం మండలంలోని అనుంపల్లి గ్రామంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు శంకర్‌నాయక్ స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి మహేష్, అనుంపల్లి సర్పంచి నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో 'క్రీసెంట్' విద్యార్థి ప్రతిభ

అనంతపురం కలెక్టరేట్ : నగరంలోని క్రీసెంట్ పాఠశాలకు చెందిన విద్యార్థి అబాకస్ పోటీల్లో అంత్యత ప్రతిభ కనబరిచి ఛాంపియన్‌షిప్ దక్కించుకున్నాడు. ఎక్సైజ్ ఎస్ఐ నరేష్‌బాబు, ఆర్‌జెడి కార్యాలయంలో ఎఒగా పని చేస్తున్న సురేఖ కుమారుడు ప్రథమేష్ క్రీసెంట్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఈనేపథ్యంలో అబాకస్ పోటీల్లో ఛాంపియన్‌గా నిలిచిన ప్రథమేష్‌ను పాఠశాల కరస్పాండెంట్ షమీం షఫీబుల్లా, హెడ్మాస్టర్ వెంకటేష్, మ్యాథమెటిక్స్ టీచర్స్ వత్సల, అరుణ తదితరులు మంగళవారం అభినందించారు.

పేదలకు ఇళ్ల పంపిణీ నిర్ణయం హర్షణీయం

శింగనమల : రాష్ట్రంలో అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు సిఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని టిడిపి నాయకులు కాయల రమణయాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. కొత్త లబ్ధిదారులకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలని నిర్ణయించడం సంతోషకరమన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

శింగనమల : వేగంగా మారుతున్న ప్రపంచంలో విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని ముందుకు సాగాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం గ్రామం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థుల ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవతా ఫౌండేషన్‌కు చెందిన తరిమెల అమర్నాథ్‌రెడ్డి, రీసోర్స్ పర్సన్ డివి.వాసవీలత మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ధేశించుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు రంజిత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

జడ్జిని సన్మానిస్తున్న అతిథులు

ఆత్మకూరు : మండలంలోని వేపచెర్ల తండాలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయ సేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు, జడ్జి శివప్రసాద్రయాదవ్ చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం దాదాపు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ జిల్లా అధికారి రామాంజనేయులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా.. యువకుడు మృతి

ధనుష్ (పాతచిత్రం)

గార్లదిన్నె : మండల కేంద్రంలోని శింగమల క్రాస్ సమీపంలో మంగళవారం ఆటో బోల్తా పడి యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..శింగనమల మండలం గురుగుంట్ల నుంచి గార్లదిన్నెకు కూలీలతో వస్తున్న ఆటో బ్రిడ్జి దగ్గరకు రాగానే కుక్క అడ్డురావడంతో తప్పించబోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో ప్రయాణిస్తున్న జనార్ధన్, ఎర్రిస్వామి, ధనుష్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అదే ఆటోలో స్థానికులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ధనుష్ మృతి చెందినట్లు గార్లదిన్నె పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

28 గొర్రె పిల్లలు మృతి

బెలుగుప్ప : మండల పరిధిలోని దుద్దే కుంట గ్రామానికి చెందిన రమేష్, హనుమంతరాయుడు, ఎర్రిస్వామికి చెందిన 28 గొర్రె పిల్లలు ఆదివారం రాత్రి అకస్మాత్తుగా మృతి చెందాయి. వెంటనే పశువైద్యాధికారి డాక్టర్ రమేష్‌కు సమాచారం అందించారు. ఆయన ఘటనా స్థలానికి వచ్చి మృతిచెందిన గొర్రె పిల్లలకు శవ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి టాక్సీమియా అనే వ్యాధితో గొర్రె పిల్లలు మృతి చెందాయని నిర్ధారించారు. అయితే వ్యాధి తీవ్రతను అంచనా వేసేందుకు జిల్లా పశువ్యాధి నిర్ధారణ విభాగానికి గొర్రె పిల్లలను తరలించినట్లు తెలిపారు. మృతిచెందిన పిల్లల విలువ సుమారు రూ.80వేలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గొర్రెల కాపరులు, రైతులు పాల్గొన్నారు.

మృతిచెందిన గొర్రెపిల్లలు